నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 1 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## మిస్సింగ్, అసహజ మరణాల కేసులపై ప్రత్యేక దృష్టి


అధికారులతో మాట్లాడుతున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

మంచిర్యాల అర్బన్, జూలై 31: మిస్సింగ్, అసహజ మరణాల కేసులు, డయల్ 100 ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. నేరాల నియంత్రణపై బుధవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో ఏసీపీ ఆర్ ప్రకాశ్‌తో కలిసి పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డయల్ 100 కాల్స్‌పై త్వరగా స్పందించాలని, ఎవరైనా తప్పిపోయినట్లు ఫిర్యాదు అందితే వెంటనే కేసు నమోదు చేసి మిస్సింగ్ అయిన వ్యక్తి ఫొటోను అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించి సంబంధిత వెబ్‌సైట్‌లో పొందు పర్చాలని ఆదేశించారు. అసహజ మరణాలు దర్యాప్తు విషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి లోతుగా పరిశోధించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా '30 పోలీస్ యాక్ట్' అమలు

### కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ టౌన్, జూలై 31 : ఆగస్ట్ 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో 30 పోలీస్ యాక్ట్–1861 యాక్ట్ నిబంధనలు అమలులో ఉంటాయని బుధవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించేందుకు ఈ నెల 1 వ తేదీ నుంచి 31 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమలులోఉంటుందని పేర్కొన్నారు. ఈ యాక్ట్ ప్రకారం జిల్లాలో డీఎస్పీ లేదా పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుంపులు గుంపులుగా ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించవద్దని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి గొలిపే ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జనజీవనానికి ఇబ్బందులు కలిగించే సమావేశాలు, జన సమూహాలు పూర్తిగా నిషేధమని తెలిపారు. ప్రచార రథాలు, లౌడ్ స్పీకర్లు, డీజేలు వంటివి నిషేధమని తెలిపారు. ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఏవైనా సమావేశాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు.


రామగుండం కమిషనరేట్ ఆవరణలో మొక్క నాటుతున్న సీపీ శ్రీనివాస్

## మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

### రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, జూలై 31: 'ఇచ్ వన్ ప్లాంట్ వన్' అనే నినాదంతో మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రామగుండంలోని కమిషనరేట్ ఆవరణలో సీపీ పోలీస్ అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జీవరాశి మనుగడ, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతూల్యతను కాపాడడంలో మొక్కలు ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపారు.

### ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

జైపూర్, జూలై 31: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఉదయం జైపూర్ పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, రికార్డులను పరిశీలించారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది పనితీరు, 100 డయల్ ఫిర్యాదులు, కేసుల వివరాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రామాల్లో పల్లె నిద్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, గంజాయి, మత్తు పదార్థాల సరఫరాపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్ఐ శ్రీధర్, కానిస్టేబుళ్లు, సిబ్బంది ఉన్నారు.

# ఇక్కడ వృథా.. అక్కడ వ్యథ

- ప్రాజెక్టు గేట్లు తెరిచి వృథాగా నీటి విడుదల
- సాగునీరందక ఆయకట్టు రైతులకు తిప్పలు
- నీళ్లు లేక నిరుపయోగంగా పంట కాలువలు


కుమ్రం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరిలోకి వృథాగా పోతున్న నీరు


ప్రాజెక్టు నుంచి పంటలకు నీటి విడుదల లేక పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిన కాలువ

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): కుమ్రం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పంటలకు అందించాల్సిన సాగునీరు వృథాగా గోదావరి పాలవుతుండగా మరో వైపు ఆయకట్టు పంటలకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇంకో వైపు ప్రాజెక్టు కాలువల్లో పిచ్చి మొక్కలు, పూడికతో నిండిపోయి నిరుపయోగంగా మారుతున్నాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అతిపెద్దదైనా కుమ్రం భీం ప్రాజెక్టును 45,500 ఎకరాలకు సాగునీరందించేందుకు నిర్మించారు. వట్టివాగు ప్రాజెక్టు, చెలిమెల(ఎన్టీఆర్) ప్రాజెక్టులున్నప్పటికీ వాటి నుంచి ఇంతవరకూ పంటలకు సాగునీరందించలేదు. కానీ కుమ్రం భీం ప్రాజెక్టు ద్వారా రైతులకు ఎంతో కొంత మేలు జరిగింది. ప్రాజెక్టు కట్ట పగుళ్లు తేలుతుండడంతో 10 టీఎంసీల సామర్థ్యం గల కుమ్రం భీం ప్రాజెక్టు గతేడాది నుంచి 5 టీఎంసీలకు పరిమితమైంది. పగ్గుళ్లు తేలిన చోట్ల ప్లాస్టిక్ కవర్లను కప్పి అధికారులు తాత్కాలికంగా రక్షణ చర్యలు చేపడుతున్నారు. ప్రాజెక్టు మరమ్మతుల విషయం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

### 5 టీఎంసీలకే పరిమితమైన ప్రాజెక్టు ..

కుమ్రం భీం ప్రాజెక్టు కట్ట బలహీన పడి పగుళ్లు తేలడంతో వరద తాకిడిని కట్టకు తగలకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదను ఎప్పటికప్పుడు గమనిస్తూ 5 టీఎంసీలకే పరిమితం చేస్తూ మిగతా నీటిని గేట్లు తెరిచి వృథాగా వదిలేస్తున్నారు. కానీ కాలువల ద్వారా పంటలకు మాత్రం సాగునీటిని వదలడం లేదని రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలువలకు నీటిని వదిలితే ఆయకట్టు కింద ఉన్న కొన్ని ఎకరాలకైనా సాగునీరు అందేదని, ప్రస్తుతం నాట్లు వేసుకునే వారమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు కాలువలన్నీ నిరుపయోగంగా మారి పిచ్చిమొక్కలు, గడ్డి, పూడికతో నిండిపోయాయి.

### సాగునీరందక రైతుల తిప్పలు..

జిల్లాలో బావులు, బోరు బావుల నీటితో కొందరు రైతులు వరి సాగు చేస్తున్నారు. తలాపునే ప్రాజెక్టు ఉన్నప్పటికీ పంటలకు చుక్క నీరు అందడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు బావుల కింద వరి సాగు చేస్తున్నప్పటికీ విద్యుత్ కోతల కారణంగా సాగునీరు అందుతుందో లేదోనని కొంత మంది రైతులు వరి సాగుకు దూరంగా ఉంటున్నారు. గతంలో కుమ్రం భీం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో కాలువల్లో రైతులు ఆయిల్ ఇంజిన్లు పెట్టి పంటలకు నీరు అందించారు. ఈ సారి నీటి విడుదల లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్టు కట్టకు మరమ్మతులు చేయాలని, నీటిని వృథాగా వదలకుండా పంట కాలువల ద్వారా అందించాలని రైతులు కోరుతున్నారు.

## బాధ్యతాయుతంగా వైద్య సేవలందించాలి

- ప్రభుత్వ దవాఖానల్లో ఖాళీల భర్తీకి కృషి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే


రోగులతో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కాగజ్‌నగర్, జూలై 31: ప్రభుత్వ దవాఖానలో రోగులకు బాధ్యతాయుతంగా వైద్య సేవలందించాలని వైద్యులు, సిబ్బందిని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోట ప్రాంతంలోని సామాజిక 30 పడకల ప్రభుత్వ దవాఖానను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ల్యాబ్, రక్త నిల్వలు, రిజిష్టర్లు, మందుల రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. దవాఖాన ఎదుట బురదమయమైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని మున్సిపల్ డీఈ రమాదేవిని ఆదేశించారు. సిర్పూర్(టీ), బెజ్జూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయి సౌకర్యాలతో మెరుగైన వైద్య సేవలందించేలా తీసుకుంటామన్నారు. వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్ మండలంలోని బసంత్‌నగర్‌లో కడక్ నాథ్ అమిత్ మండల్ కోళ్ల పెంపకం కేంద్రాన్ని సందర్శించారు. మహిళా శక్తి కింద చేపట్టనున్న కోళ్ల పెంపకం కేంద్రాన్ని పరిశీలించారు. మహిళా శక్తి పథకం కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అర్హులకు కోళ్ల పెంపకం యూనిట్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట డీఎంహెచ్‌వో తుకారాం భట్, ఆర్డీవో రమేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, మెడికల్ ఆఫీసర్ చెన్నవేశవ, తదితరులు పాల్గొన్నారు.

### మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించేందుకు చర్యలు

ఆసిఫాబాద్ టౌన్, జూలై 31: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెనూ ప్రకారం పోషకాహారం సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు పౌష్టికాహారం అవసరమైన మందులను అందించడంపై యూనిసెఫ్ ప్రతినిధులు, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు, ఆహార విభాగం సమన్వయకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నామని, పిల్లల శారీరక, మానసిక ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతంలోని పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనిసెఫ్ ప్రతినిధులు ఖ్యాతి తివారి, రేషా దేశాయ్, నరసింహారావు, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన విద్యార్థిని మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

-కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల నాయకుల వినతి

ఆసిఫాబాద్ టౌన్, జూలై 31: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో అనారోగ్యంతో విద్యార్థిని మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థిని కుమ్రం లక్ష్మి కళాశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రెండు రోజుల క్రితం జ్వరంతో మృతి చెందిందని ఆరోపించారు. పది రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతుంటే అక్కడ పని చేస్తున్న సిబ్బంది పారాసిటమల్ గోలీలు ఇచ్చి సరిపెట్టారని, మెరుగైన వైద్యం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిని ఇంటికి పంపించాలని తల్లిదండ్రులు కోరినా పంపించలేదన్నారు. విద్యార్థిని ఆరోగ్యం విషమించిన తర్వాత తల్లిదండ్రులకు అప్పాజెప్పారని, అదే రోజు రాత్రి విద్యార్థిని ఆరోగ్యం క్షీణించి మృతి చెందిందని తెలిపారు. విద్యార్థిని మృతికి కారణమైన ప్రిన్సిపాల్, ఏఎన్ఎం, వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థిని కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. జిల్లాలో అన్ని వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టీకనంద్, గొడిసెల కార్తిక్, టీపీజీఎస్ జిల్లా అధ్యక్షురాలు. కోరంగేమాల శ్రీ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి, దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు


లక్షెట్టిపేటలో రాస్తారోకో చేస్తున్న మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

## ప్రిన్సిపాల్ బదిలీని నిలిపివేయాలని రాస్తారోకో

లక్షెట్టిపేట, జూలై 31: లక్షెట్టిపేట పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా బదిలీని నిలిపివేయాలని కోరుతూ విద్యార్థులు బుధవారం ఊత్కూర్ చౌ రస్తాలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ గతంలో ఆరేళ్ల క్రితం ఈ కళాశాలలో కేవలం 45మంది విద్యార్థులే ఉండేవారని కానీ ఈ ప్రిన్సిపాల్ వచ్చాక సుమారు 1250 మంది చేరేలా కృషి చేసి, కళాశాల అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. రాస్తారోకోతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు వచ్చి మాట్లాడి విద్యార్థులతో ఆందోళన విరమింపజేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

## విద్యార్థులను డ్రగ్స్‌కు దూరంగా ఉంచాలి

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూలై 31 : విద్యార్థుల భవిష్యత్‌పై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీసీపీ భాస్కర్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణతో కలిసి ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగదారులను నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా పాఠశాలల స్థాయిలో క్లబ్‌లను ప్రారంభించామని తెలిపారు. వీటికి అధ్యక్షులుగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యక్షులుగా ఉపాధ్యాయులు, సభ్యులుగా ఇద్దరు విద్యార్థులు, ప్రతినిధులుగా విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఒక పోలీస్ కానిస్టేబుల్ ఉంటారని తెలిపారు. మాదకద్రవ్యాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలు వినియోగించడంతో కలిగే నష్టాలను అర్థమయ్యేలా ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖనం ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు. పాఠశాలల్లో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేయాలని, విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఎలాంటి పొగాకు ఉత్పత్తులు, మాదక ద్రవ్యాల విక్రయాలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన మాదకద్రవ్యాల సంబంధిత 29 కేసుల్లో 18 నుంచి 23 ఏళ్లు గల 300 మంది ఉన్నారని తెలిపారు. మత్తు పదార్థాలు నిల్వ ఉంటే డయల్ 100 , టోల్‌ఫ్రీ నంబర్ 14446, 8712671111, రాష్ట్ర స్థాయిలో 8712656597 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### నేడు సీఎం రేవంత్‌రెడ్డి

## దిష్టి బొమ్మల దహనం

### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

చెన్నూర్, జూలై 31: ఆడ బిడ్డలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం సీఎం దిష్టిబొమ్మలను దహనం చేయాలని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై సీఎం చేసిన నీచమైన వ్యాఖ్యలకు నిరసనగా జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో సీఎం దిష్టి బొమ్మలను దహనం చేయాలని తెలిపారు. 'ఆడబిడ్డలను నమ్ముకుంటే ఆగమైతావు.. ఆడబిడ్డలను నమ్ముకుంటే ముంచుతారు..జీవితం బస్టాండ్ పాలవుతుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన నీచమైన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## రుణమాఫీ డబ్బులను రైతులకు చెల్లించాలి

### బ్యాంకు అధికారులకు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం


తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రుణమాఫీ రైతుల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, జూలై 31 : రెండవ విడుత రుణమాఫీ డబ్బులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా చెల్లించాలని బ్యాంకు అధికారులను కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రుణమాఫీ నగదు చెల్లింపు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ విడుత రుణమాఫీలో భాగంగా రూ.లక్ష నుంచి రూ. లక్షా యాభైవేల వరకు రుణం గల రైతులకు నగదు చెల్లిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రెండవ విడుత రుణమాఫీలో 14,104 మంది రైతులకు రూ.136,46,56,254 అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రుణమాఫీ నగదు మొత్తాన్ని రైతుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రణాళికా బద్ధంగా నగదు చెల్లించాలన్నారు. రైతులు ఏదైనా సమాచారం కోసం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ఫోన్ నం. 08736-250501లో గానీ మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. రైతుల పట్ల బ్యాంక్ అధికారులు, సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని, జవాబుదారితనంతో వ్యవహరించాలని ఆదేశించారు. రెండవ విడుత రుణమాఫీ ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం మండల తహసీల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ధరణి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ ను పరిశీలించారు. భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణం, పేర్లు, ఇతర వివరాల మార్పుల సవరణ కోసం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తు తిరస్కరణకు కారణాన్ని నమోదు చేయాలని తెలిపారు. కులం, ఆదాయం, నివాసం, కుటుంబ సభ్యుల, తదితర సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేయవద్దని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావ్ దేశ్ పాండే, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక..
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679